క్లుప్తంగా

25న ప్రజావేదిక కార్యక్రమం

శావల్యాపురం: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం 16వ విడత ప్రజావేదిక కార్యక్రమం ఈనెల 25న ఉదయం 10 గంటలకు మండల స్థాయిలో జరుగుతుందని ఎంపీడీవో కొర్రపాటి కవితాచౌదరి సోమవారం తెలిపారు. ప్రజావేదిక కార్యక్రమానికి జిల్లా ప్రాజెక్టు పీడీ గంగవరపు జోసఫ్‌కుమార్, ఇతర శాఖల అధికారులు పాల్గొంటారన్నారు. మండల స్థాయిలో ప్రజావేదిక కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు సర్పంచులు,ఎంపీటీసీలు అధికారులు అందరు పాల్గొని ఈ కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. ఎస్ఆర్‌పీ జెఎస్ రాజు, ఏపీవో కె.రామారావు ఉపాధి అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



నరసరావుపేట రూరల్: లింగంగుంట్లలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీవో రవికాంత్ సోమవారం సందర్శించారు. కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు అందజేస్తున్న ఆహార పదార్థాల వివరాలను కేంద్రం నిర్వాహకురాలిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందజేస్తున్న పోషక పదార్థాలను చిన్నారులకు, గర్భిణులకు సక్రమంగా అందజేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ అరుణ్‌కుమార్ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శిస్తున్నట్టు ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.వి.శివప్రసాద్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

తపాలా సేవలపై అవగాహన

నరసరావుపేట టౌన్: డాక్ చౌపల్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని హెడ్ పోస్టాఫీస్‌లో బుధవారం అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ పి.వెంకటస్వామి సోమవారం తెలిపారు. కార్యక్రమానికి ప్రజలు హాజరై పోస్టాఫీస్ ద్వారా పొందే సేవలను తెలుసుకొని వాటిని వినియోగించుకోవాలని కోరారు.


శాంతించిన వర్షపు జల్లులు

రొంపిచర్ల: మండలంలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలు శాంతించాయి. మండల కేంద్రమైన రొంపిచర్లలో సోమవారం ఉదయానికి 12.6 ఎం.ఎం వర్షపాతం నమోదు అయిందని తహసీల్దార్ కార్యాలయ అధికారులు తెలిపారు. ఎడతెరిపి లేకుండా నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలు సోమవారం ఉదయం నుంచి ఆగిపోవటంతో కొంత మేర ప్రజలు వర్షం నుంచి ఉపశమనం పొందారు. బురదగా ఉన్న మట్టి రోడ్లు, చిత్తడి చిత్తడిగా ఉన్న సిమ్మెంట్ రోడ్లు వర్షం ఆగటంతో ఆరిపోయాయి. అయినప్పటికీ ఆకాశం మేఘావృతమై ఉండటం వల్ల, వ్యవసాయ భూముల్లో తేమ ఎక్కువగా ఉండటంతో వ్యవసాయ పనులు నిర్వహించలేదు. రైతులు, రైతు కూలీలు గృహాలకే పరిమితమయ్యారు.

నలుగురు జూదరుల అరెస్టు

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్ల గ్రామ పరిధిలోని గ్రానైట్ క్వారీల సమీపంలో కోత ముక్క ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేశారు. కోతముక్క ఆడుతున్న నలుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.960లు స్వాధీనం చేసుకున్నారు. నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జె.బలరామ్‌రెడ్డి తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి



వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండల పరిషత్ కార్యాలయంలోమండల పరిషత్ అభివృద్ధి అధికారి టి.వీరభద్రాచారి అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులకు, ఇంజినీరింగ్ అసిస్టెంట్స్‌కు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓడీఎఫ్ ప్లస్ సర్వే, శానిటేషన్, సీజనల్ వ్యాధులు తదితర అంశాలపై సమీక్ష చేపట్టారు. కార్యక్రమంలో స్వచ్ఛభారత్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్ కంచర్ల సుబ్బరామయ్య పాల్గొన్నారు.

వరకట్న వేధింపులపై రెండు కేసులు నమోదు

నాదెండ్ల: అగ్ని సాక్షిగా తాళికట్టిన భర్త, అత్తమామలు వరకట్నం తెమ్మంటూ తనను వేధింపులకు గురి చేస్తున్నారని ఇర్లపాడు గ్రామానికి చెందిన సరగాల మణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు బాపట్ల పట్టణానికి చెందిన సరగాల బెంజిమెన్‌కు ఇర్లపాడు గ్రామానికి చెందిన మణితో ఏడాది క్రితం వివాహం జరిగింది. వివాహమైన కొద్ది కాలనికే భర్త బెంజిమెన్, అత్తమామలు ఎస్తేరు, లూథర్‌లు అదనపు కట్నం తెమ్మంటూ వేధింపులకు గురిచేస్తున్నారు. దీంతో బాధితురాలు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గణపవరంలో...

గణపవరం వేలూరు రోడ్డులో నివాసం ఉండే యక్కల పూజిత తన భర్త, అత్తమామలు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మార్టూరుకు చెందిన యక్కల రామకృష్ణతో పూజితకు రెండేళ్ల క్రితం కులాంతర వివాహం జరిగింది. కొద్ది నెలల నుండి భర్త రామకృష్ణతో పాటూ అత్తమామలు వేధింపులకు గురిచేస్తున్నారంటూ ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు పాఠశాలల్లో శిక్షాసప్తాహ్

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెంలో గల ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలలో సోమవారం శిక్ష సప్తాహః కార్యక్రమాలను ప్రారంభించారు. స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఆదేశాల మేరకు శిక్ష సప్తాహః కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రవినాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి తక్కువ ఖర్చుతో నిరుపయోగంగా ఉండే వస్తువులతో ఉపాధ్యాయులు 100కు పైగా పరికరాలను తయారు చేశారన్నారు. ఈ పరికరాలతో వివిధ సబ్జెక్ట్‌లకు సంబంధించి చేసే బోధనలో కూడా ఉపయోగ పడతాయన్నారు.

పరికరాలతోనే సెమినార్‌లు, ప్రాజెక్ట్‌లు నిర్వహణలో ప్రదర్శించామన్నారు. ఈ పరికరాల ద్వారా విద్యార్థులకు తక్కువ వ్యవధిలో ఎక్కువ జ్ఞాన బోధ చేయవచ్చునన్నారు. కళాత్మకంగా తయారు చేసిన బోధనా పరికరాలు విద్యార్థులను ఎంతగానో ఆకర్షించాయన్నారు. ఈ పరికరాలు విద్యార్థులను మానసిక వికాసాన్ని పెంపొందించటంతో పాటు విజ్ఞాన సముపార్జన, వారిలో సృజనాత్మకతను వెలికి తీయడానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. మొదటి రోజు శిక్ష సప్తాహః కార్యక్రమం విజయవంతం చేయడంలో ముఖ్యపాత్ర వహించిన ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. అలాగే ఏడు రోజుల పాటు జరిగే శిక్ష సప్తాహః కార్యక్రమాలన్నింటినీ విజయవంతం చేయడంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రధాన భూమికను పోషించాలని ఆయన కోరారు.



బోధనా పరికరాలను తయారు చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

బోధనా పరికరాల ప్రదర్శన

చిలకలూరిపేట: కేంద్రప్రభుత్వ జాతీయ విద్యా విధానం అమలులో భాగంగా శిక్షా సప్తాహ కార్యక్రమం పట్టణంలోని పలు మున్సిపల్ పాఠశాలల్లో సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం నుంచి ఈ నెల 28 వరకు స్థానికంగా లభించే వనరులను ఉపయోగించి బోధనాపరికరాల తయారీ, ప్రదర్శన నిర్వహించారు. ఎంసీఆర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం కె.సుధా మాట్లాడుతూ బోధనా పరికరాల తయారీతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందని చెప్పారు. ఈ విధానం వలన విద్యార్థులకు సులభంగా పాఠ్యాంశాలు అర్థమౌతాయని వెల్లడించారు. ప్రదర్శన వల్ల విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.శ్రీనివాసరావు, ఏ నీలిమ, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



బోధనా పరికరాలను ప్రదర్శించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు

నాదెండ్లలో...

నాదెండ్ల: చిన్నారులకు సులభంగా అర్థమయ్యే రీతిలో ఆటపాటలతో విద్యాబోధన చేస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఎంఈవో ఈమని కృష్ణారెడ్డి చెప్పారు. నాదెండ్ల మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం విద్యా సప్తాహం నిర్వహించారు. సోమవారం నుంచి ఈ నెల 28 వరకూ జాతీయ విద్యావిధానంపై ఏడు అంశాల్లో కార్యక్రమం నిర్వహించనున్నారు. అప్పాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జాతీయ విద్యావిధానం -2020 నాలుగేళ్ల పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని విద్యాసప్తాహ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా తొలిరోజు అన్ని పాఠశాలల్లో బోధనా, అభ్యసనా సామగ్రిపై అవగాహన, ప్రదర్శన నిర్వహించారు. రెండో రోజు ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ డేగా, మూడో రోజు స్పోర్ట్స్‌డే, నాలుగో రోజు కల్చరల్ డే, ఐదో రోజు స్కిల్లింగ్ అండ్ డిజిటల్ ఇనీషియేటివ్స్‌డే, ఆరో రోజు ఇకో క్లబ్ ఫర్ మిషన్ లైఫ్, చివరి రోజు కమ్యూనిటీ ఇన్వాల్వ్‌మెంట్ డే నిర్వహించనున్నారు. ప్రతిరోజూ అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు.



బోధనా పరికరాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు



జాష్టివారిపాలెం ప్రాథమిక పాఠశాలలో బోధనా సామగ్రితో విద్యార్థులు



గొరిజవోలు హెచ్‌డబ్ల్యు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శన

కలెక్టర్‌ను కలిసిన మాజీ జెడ్పీ చైర్మన్

నరసరావుపేట: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాస్, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, నరసరావుపేట నియోజకవర్గం ఇన్‌చార్జి సయ్యద్ జిలానీ సోమవారం జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబును ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. సయ్యద్ జిలాని మాట్లాడుతూ జిల్లాలో అనేక ప్రజా సమస్యలపై గతంలో అనేక పోరాటాలు చేసి గత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత నియమితులైన అరుణ్‌బాబు జిల్లాకు రావడం జరిగిందన్నారు. మరల ప్రజా సమస్యలు వారి దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. జనసేన పార్టీ అధికార ప్రతినిధి షేక్ ఆద్రుఫ్, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి రాపర్ల జగ్గరావు, డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియం డెవలప్మెంట్ సొసైటీ అడ్వైజర్ యస్.కె.జిలానీ మాలిక్, మిరియాల సోమ శంకర్ పాల్గొన్నారు.



కలెక్టర్ అరుణ్‌బాబును సత్కరిస్తున్న రాయపాటి శ్రీనివాస్, సయ్యద్ జిలాని

చెరువులకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి

చిలకలూరిపేట: రెండు మంచినీటి చెరువుల చుట్టూ రక్షణగా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవింద రావును కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీన పట్టణంలోని సుగాలీ కాలనీకి చెందిన హనుమానాయక్ అనే వ్యక్తి పాత చెరువులో పడి మృతి చెందిన సంగతి గుర్తు చేశారు. గతంలోనూ పలు మార్లు రెండు చెరువుల్లో పడి పలువురు మృతి చెందిన విషయాన్ని కమిషనర్ దృష్టికి తెచ్చారు. మునుముందు ఇలాంటి సంఘటనలు జరగకుండా తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. తగు చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు బి.శ్రీనునాయక్, నాయకులు కుంభా నాగేశ్వరరావు, బి.చిన్నా నాయక్, పాలపర్తి శ్రీనివాసరావు, బి.రాంబాబు నాయక్ పాల్గొన్నారు.



కమిషనర్ గోవిందరావుకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నైపుణ్యం, కఠోర సాధనలతోనే ఉన్నత శిఖరాలు

నరసరావుపేట రూరల్: నైపుణ్యంతో పాటు కఠోర సాధన, అంకితభావాన్ని అలవర్చుకుంటే జీవితంలో ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని మాజీ ఎమ్మెల్యే, తిరుమల ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ బొల్లా బ్రహ్మ నాయుడు తెలిపారు. కళాశాలలో సోమవారం ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం తరగతుల ప్రారంభ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ బ్రహ్మనాయుడు, కార్యదర్శి రావెల సత్యనారాయణ, కళాశాల జాయింట్ సెక్రటరీ డాక్టర్ నలబోతు వెంకట్రావు, ప్రిన్సిపల్ డాక్టర్ వైవీ నారాయణలు పాల్గొన్నారు. బ్రహ్మనాయుడు మాట్లాడుతూ వెనుకబడిన పల్నాడు ప్రాంతంలోని పేద విద్యార్థులకు మెరుగైన ఇంజినీరింగ్ విద్యను అందించేందుకు 2008లో కళాశాలను ప్రారంభించినట్టు తెలిపారు. కళాశాలలో విద్యనభ్యసించిన ఎంతోమంది విద్యార్థులు నేడు విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులు వారి తల్లిదండ్రులకు, కళాశాలకు పేరు తీసుకువచ్చేలా రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కళాశాలలో కల్పించినట్టు తెలిపారు. 100 శాతం ప్లేస్‌మెంట్స్ కల్పించడమే లక్ష్యంగా కళాశాల సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



మాట్లాడుతున్న బ్రహ్మనాయుడు

రొంపిచర్లలో డెంగీ వ్యతిరేక ర్యాలీ

రొంపిచర్ల: మండలంలోని రైతునగర్‌లో ప్రాథమిక వైద్యశాల ఆధ్వర్యంలో సోమవారం డయేరియా నిర్మూలన, డెంగీ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. డెంగీ వ్యాధిని నివారిద్దామని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ జగన్ నరసింహారెడ్డి మాట్లాడుతూ డయేరియా, డెంగీ వాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా పరిసరాల శుభ్రతతో పాటు, మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. టైర్లలో, కొబ్బరి బోండాలు, తొట్లు, రోళ్లు, ప్లాస్టిక్ పాత్రల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉంటే అందులో ఏర్పడే దోమల వల్ల డెంగ్యూ వాధి వచ్చే అవకాశాలున్నాయన్నారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ దోమతెరలను వాడాలన్నారు. కార్యక్రమంలో రైతునగర్ పెద్దలు బోయపాటి వాసు, శాకమూరి ఆంజనేయులు, హెల్త్ సూపర్‌వైజర్ రామయ్య, కిరణ్, ఏఎన్‌ఎంలు, ఆశాలు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



రైతు నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తైక్వాండో పోటీలకు ఎస్ఎస్ అండ్ ఎన్ విద్యార్థిని

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల విద్యార్థిని వి.తులసితన్మయ్ ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సోము మల్లయ్య, వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ యక్కల మధుసూదనరావు సోమవారం తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో రేపల్లె నియోజకవర్గం పల్లెకోనలో ఈనెల 21వతేదిన నిర్వహించిన జిల్లాస్థాయి మహిళా టైక్వాండో టీమ్ ఎంపిక పోటీలలో తులసీతన్మయ్ రజిత పతకం సాధించటంతో పాటు జిల్లా జట్టుకు ఎంపికైందని వివరించారు. త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో తులసీతన్మయ్ ఉమ్మడి గుంటూరుజిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన తులసీతన్మయ్‌ను కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త, నర్సింగ్ విభాగం ఇన్‌చార్జ్ ఏవీఎస్ గుప్త, అధ్యాపకులు అభినందించారు.



రజిత పతకం అందుకుంటున్న తులసీతన్మయ్

జేఎన్‌టీయూఎన్ విభాగాధిపతికి పీహెచ్‌డీ

నరసరావుపేట రూరల్: జేఎన్‌టీయూఎన్ ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ విభాగాధిపతి ఐ. ఫణిసుష్మ మెకానికల్ బ్రాంచ్‌లో పీహెచ్‌డీ పట్టా పొందినట్టు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ప్రొఫెసర్ జీఎల్ శామ్యూల్ పర్యవేక్షణలో ఇన్వేస్టిగేషన్స్ ఇన్‌టూ ఫెర్ఫార్మన్స్ ఆఫ్ టెక్ట్ అండ్ చంఫర్డ్ పీసీడి కటింగ్ ఇన్సర్ట్ డూరింగ్ హై స్పెయిడ్ మెషిన్ ఆఫ్ ఎల్6061 అనే అంశంపై పరిశోధన పత్రం సమర్పించారు. దీనికి గాను ఐఐటీ మద్రాసు పీహెచ్‌డీ పట్టాను ఫణిసుష్మకు అందజేసింది. ఈనెల 19వ తేదీన మద్రాసు ఐఐటీ 61వ స్నాతకోత్సవంలో పీహెచ్‌డీ పట్టాను ముఖ్యఅతిథుల చేతుల మీదగా ఆమె అందుకున్నారు. పీహెచ్‌డీ సాధించిన ఫణిసుష్మకు కళాశాల అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.



ఫణిసుష్మ

ప్రణాళికాబద్ధంగా విద్యనభ్యసిస్తే ఉజ్వల భవిష్యత్

ఏపీ రెసిడెన్షియల్ ప్రిన్సిపల్ ఎన్.సుబ్రమణ్యం

చిలకలూరిపేటటౌన్: విద్యను ప్రణాళికాబద్ధంగా అభ్యసిస్తే మంచి ఫలితాలు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఏపీ రెసిడెన్షియల్ ప్రిన్సిపల్ ఎన్.సుబ్రమణ్యం చెప్పారు. చిలకలూరిపేట మండలంలోని రాజాపేట ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థి కీమావత్ వెంకటేష్ నాయక్‌కు ట్రిపుల్ ఐటీ నూజివీడులో సీటు సాధించనందుకు సోమవారం అభినందన సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్కూల్ విద్యార్థులకు ఉపాధ్యాయులు పలు మోటివేషన్ అంశాలను వివరించారు. అనంతరం విద్యార్థి వెంకటేష్ నాయక్‌తో పాటు అతని తండ్రి రాజునాయక్‌ను శాలువతో సత్కరించారు. మోమెంటో, రూ.2 వేల నగదు అందించారు. కార్యక్రమంలో వైఎస్ ప్రిన్సిపల్ ఎఎంఎస్‌బీ కృష్ణ, పీఈటీ వై డేవిడ్‌రాజు పాల్గొన్నారు.



విద్యార్థి వెంకటేష్ నాయక్‌ను అభినందిస్తున్న రాజాపేట ఏపీఆర్ స్కూల్ గురువులు

ఆర్‌యూబీ దాటుతున్నారా? అయితే జాగ్రత్త

- ప్రజలకు సూచించిన రైల్వే అధికారులు
- డివిజన్‌లో 14 ఆర్‌యూబీలలో నీరు నిలిచే అవకాశం

నరసరావుపేట: భారీ వర్షాల సమయంలో రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ)లను దాటే సమయంలో వినియోగదారులు జాగ్రత్తలు పాటించాలని గుంటూరు డివిజన్ రైల్వే ఆఫీసర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రోడ్డు వినియోగదారుల భద్రతకోసం డివిజన్ పరిధిలో 188 ఆర్‌యూబీలను నిర్మించడం జరిగిందన్నారు. వీటిలో 14 మాత్రమే నీరు నిల్చిపోయే అవకాశాలున్నాయన్నారు. భారీ వర్షాల కారణంగా కొన్నిచోట్ల అవి నీటితో నిండుతున్నాయని, ఆ సమయంలో వినియోగదారుల భద్రతకోసం చర్యలు తీసుకోవటం జరిగిందన్నారు. ఆర్‌యూబీల వద్ద రాత్రి, పగలు వాచ్‌మెన్‌లను నియమించామని, 50సెం.మీ స్థాయి నీరు నిండితే అక్కడ రెడ్‌గుర్తు వేయటం జరిగిందని, నీటిమట్టం ఆ మార్క్‌కు చేరితే ఆర్‌యూబీలోకి ప్రవేశించవద్దన్నారు. ఏదైనా కష్టం వచ్చిన సమయంలో కాంట్రాక్టర్, రైల్వే అధికారుల నంబర్లు అక్కడ ముద్రించామన్నారు. వరదల సమయంలో పంపింగ్ పూర్తయ్యేంత వరకు ఆర్‌యూబీ గుండా ప్రయాణాలను నిషేధించబడ్డాయన్నారు. 2025 జూన్ నాటికి ఆర్‌యూబీలలో నీరు నిలబడకుండా తీసుకున్న చర్యలు పూర్తవుతాయని పేర్కొన్నారు.



ఆర్‌యూబీలలో నీటిమట్టం తెలియచేసే రెడ్‌గుర్తు వేసిన దృశ్యం

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



ఈపూరు: మండల కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా జిల్లా ఎన్ఎఫ్ఏ సైదయ్య క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. రైతు దారా ప్రకాష్‌రావు పొలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సైదయ్య మాట్లాడుతూ సైదయ్య 30 రకాల విత్తనాలు చల్లడం జరిగిందని, విత్తనాల్లో లభించే ఆకుకూరలు, కూరగాయలు వారి కుటుంబానికి వినియోగించుకోగా మిగిలినవి పశువులకు మేతగా ఉపయోగపడతుందని సూచించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతి పాటించడం వలన భూమిలో కర్బన శాతం పెరుగుతుందని, నీటిని నిలుపుకునే శక్తి పెరుగుతుందన్నారు. తరువాత వేసే ప్రధాన పంటకు ఎటువంటి చీడపీడలు ఆశించవన్నారు. ప్రకృతి వ్యవసాయంలో అంతర పంటల పద్ధతి ఆచరించడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మాస్టర్ తిరుపతిరావు, భాస్కరరావు, లక్ష్మానాయక్, నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఐదు గ్రామాల్లో ఆధార్ క్యాంపు

నాదెండ్ల: మండలంలోని ఐదు గ్రామాల్లో ఆధార్ వెరిఫికేషన్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్ తెలిపారు. మంగళవారం సంకురాత్రిపాడు, 24న గొరిజవోలు, 25న చందవరం, 26న సాతులూరు, 27న కనపర్రు గ్రామాల్లో ఉదయం 10-సాయంత్రం 5 గంటల వరకూ సచివాలయాల వద్ద ఆధార్ క్యాంపులు జరుగుతాయన్నారు. ఈ క్యాంపుల ద్వారా ఏడాది నుంచి పదమూడేళ్ల లోపు చిన్నారులకు ఎలాంటి రుసుము లేకుండా ఆధార్ నమోదు చేయబడుతుందన్నారు. ఆధార్‌లో వివరాల సవరణలకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. సవరణలకు సంబంధించి నిర్దిష్టమైన ఆధారాలు సమర్పించాల్సి ఉంటుందన్నారు. అడ్రస్సు మార్పు కోసం తప్పనిసరిగా గెజిటెడ్ అధికారి సంతకంతో ధృవీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుందన్నారు.

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులు

యడ్లపాడు: కొత్త ఆధార్ నమోదు.. పాత ఆధార్ కార్డుల అప్‌డేట్ కోసం ఏర్పాటు చేసే ప్రత్యేక శిబిరాలను యడ్లపాడు మండలం ప్రజలు తప్పక సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వై.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆధార్ అప్‌డేట్ ప్రత్యేక శిబిరాల వివరాలను తన కార్యాలయంలో విలేకర్లకు వెల్లడించారు. మండలంలోని జాలాది సచివాలయం పరిధిలో మాత్రమే ఆధార్ సెంటర్ ఉన్నందున 23, 24, 25 తేదీల్లో జాలాది గ్రామంలోనూ, 26, 27వ తేదీల్లో జగ్గాపురం గ్రామంలో ఈ ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నామని వివరించారు. 23వ తేదీన జాలాది గ్రామ సచివాలయం, 24న జాలాదిలోని మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాల, 25న జాలాది అంగన్‌వాడీ కేంద్రం, 26న జగ్గాపురం జిల్లా పరిషత్ హైస్కూల్, 27న జగ్గాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈ ప్రత్యేక శిబిరాలు అందుబాటులో ఉంటాయన్నారు. యడ్లపాడు మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ప్రజలు ఈ అవకాశాన్ని తప్పక సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆధార్ శిబిరాలు సద్వినియోగం చేసుకోండి

శావల్యాపురం: మండల ప్రజల ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కొర్రపాటి కవితా చౌదరి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మాట్లాడుతూ ఈనెల 23న పిచికలపాలెంలో గ్రామ సచివాలయం, 24న గుంటుపాలెం, 25న కారుమంచి,26న పోట్లూరు, 27న వేల్పూరు-1 గ్రామసచివాలయం పరిధిలో ప్రభుత్వ పరంగా ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

తాగునీటి చెరువుకు మరమ్మతు

శావల్యాపురం: మండల కేంద్రంలో రక్షిత మంచినీటి చెరువును పంచాయతీ నిధులతో మరమ్మతులు చేస్తున్నట్లు సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ అన్నారు. సోమవారం మంచినీటి చెరువులో జరుగుతున్న పనులను అధికారులు గ్రామపెద్దలు పరిశీలించారు. ఈసందర్భంగా పంచాయతీ కార్యదర్శి కానుగంటి మహేంద్ర మాట్లాడుతూ ప్రస్తుతం మంచినీటి చెరువులో ఉన్న నీరు బయటకు పంపుతున్నామన్నారు. చెరువు మధ్యలో ఉన్ననటువంటి బావి చుట్టు ఉన్న ఇసుకను నాలుగు అడుగుల వరకు తీసి అనంతరం నూతన ఇసుక పోస్తామన్నారు.

సామాజిక ఉపాధి గ్రామసభలు



మాట్లాడుతున్న ఎస్ఆర్‌పీ రాజు

శావల్యాపురం: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగినటు వంటి పనులపై గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించినట్లు ఏపీవో కె.రామారావు తెలిపారు. సోమవారం మండలంలోని పోట్లూరు, ఇర్లపాడు, మతుకుమల్లి, వయ్యకల్లు, శావల్యాపురం గ్రామపంచాయతీల్లో ఉపాధి గ్రామసభలు గ్రామస్తులు ప్రజాప్రతినిధులు అధికారుల సమక్షంలో నిర్వహించారు. శావల్యాపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగిన గ్రామసభలో ఎస్ఆర్‌పీ జేఎస్ రాజు పాల్గొని మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో సంవత్సరం వ్యవధిలో ఉపాధి నిధులతో జరిగిన పనుల నిధులు వినియోగం, సామాజిక పింఛన్లు తదితర వాటిపై గ్రామాల్లో సామాజిక బృందాలు తనిఖీలు చేసిన అనంతరం గ్రామసభలు నిర్వహించి బృందాలు సేకరించిన వివరాలను గ్రామస్తులు సమక్షంలో వివరించామన్నారు. ఉపాధి నిధులు వినియోగంపై పనుల్లో ఎమైనా అభ్యంతరాలు ఉన్నయడల లిఖిత పూర్వకంగా నమోదు చేసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ, డీఆర్‌పీ కన్నూరి శ్రీనివాసరావు, ఉపాధి టీఏలు రాణి, సుబ్బారావు, కానుగంటి మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఏపీపీఎస్ఏ అధ్యక్షుడిగా జంపని లక్ష్మీనారాయణ



నాదెండ్ల: ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడుగా సాతులూరు బాలభారతి ఇంగ్లీష్ మీడియం స్కూలు డైరెక్టర్ జంపని లక్ష్మీనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం నరసరావుపేటలో జరిగిన ఏపీపీఎస్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎన్నికల కమిటీ సభ్యులుగా కొల్లి బ్రహ్మయ్య, ఈఎం స్వామి, రాజారెడ్డి వ్యవహరించారు. అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడిగా అనంత రామయ్య, కార్యదర్శిగా గొంటు రామచంద్రారెడ్డి, కోశాధికారిగా శేషు, గౌరవ అధ్యక్షులుగా భూమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కార్యవర్గ సభ్యులు డి.చంద్రశేఖర్, కరణం కొండలరావు తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని అధ్యక్షుడిగా ఎన్నికైన లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. అధ్యక్షుడిగా ఎన్నికైన లక్ష్మీనారాయణను మండలంలోని పలు విద్యా సంస్థల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.